# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 19-10-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 | సంచిక:67 | పేజీలు:6 | వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

ముదము నొసంగెడి విధమున
పదవిని యంగీకరించి ప్రధితాత్ముడు-కో
విదుడగు జస్టిస్ జాన్ జే
మొదటిగ యూయస్సు న్యాయమూర్తిగ వచ్చెన్

(19-10-1789 జాన్ జే అమెరికా మొట్టమొదటి ప్రధాన న్యాయ మూర్తిగ ప్రమాణం చేసిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

ఆందోళన కలిగించే
ఆకలి మన రాజ్యం
ఎంతో దేశ సిరిసంపద
ఎవరికాయె భోజ్యం
ప్రపంచ ఆకలి సూచీ
పరుగుల్లో ముస్ముందు
అభివృద్ధని చేస్తుంటరు
అధినేతలు కనువిందు



-వేల్పుల నారాయణ
9440433475

## స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం..



హైదరాబాద్, అక్టోబర్ 18: అదానీ గ్రూప్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయంలో మంత్రి పొన్నం పూజలు..



హైదరాబాద్, అక్టోబర్ 18:ఐదవ శక్తి పీఠమైన జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి అమ్మవార్లను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తో శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ఆయనకు ఆలయ ఈఓ, పాలక మండలి చైర్మన్, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా గణపతి పూజ అనంతరం స్వామి వారికి అభిషేకాలు చేశారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అంతకుముందు హరిత టూరిజం హోటల్ లో జిల్లా కలెక్టర్ సంతోష్ పుష్పగుచ్చం ఇచ్చి మంత్రి పొన్నం ప్రభాకర్ కు స్వాగతం పలికారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను నిలిపివేయాలి- ప్రొ.కోదండరామ్




ఆదిలాబాద్, అక్టోబర్ 18: నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలం దిలావర్ పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజాగలం పేరుతో దిలావర్ పూర్ మండల కేంద్రంలో రైతులతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు పిఓడబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు సంధ్య, ఎమ్మెల్సీ కోదండరాంలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దిలావర్ పూర్ మండల కేంద్రంలో స్వచ్ఛందం గా వ్యాపార సముదాయా లను మూసి బంద్ పాటించి మద్దతు తెలిపారు. అనంతరం ఇథనాల్ ఫ్యాక్టరీ తరలించే వరకు పోరాటాలు చేస్తామని గ్రామస్తులు, రైతులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుకై గ్రామస్తులు కలిసికట్టుగా పోరాడడం మంచి పరిణామమని, ఈ పోరాటాన్ని ఇదేవిధంగా కొనసాగించాలని, ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

పిఓడబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు సంధ్య మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన విద్యాలయాలను వైద్యశాలలను ప్రభుత్వాలు ఇవ్వడం లేదు కానీ అనవసరమైన ఫ్యాక్టరీలకు మాత్రం అనుమతులు ఇస్తున్నాయని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎలాగైతే సబ్బండవర్ణాలు పోరాడాయో ఫ్యాక్టరీ రద్దుకు కూడా అదే విధంగా పోరాడాలని, ఫ్యాక్టరీ రద్దుకయ్యే చేస్తున్న మీ పోరాటం అభినందనీయమని గ్రామ ప్రజలను అభినందించారు. తెలంగాణలోని దిలావర్ పూర్ మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకుడు ఫ్యాక్టరీ పెట్టడం దురదృష్టకరమని, ఫ్యాక్టరీ కారణంగా పర్యావరణం కలుషితం అవుతుందనే విషయం పాలకులకు తెలియదా అని ప్రశ్నించారు.


**పుస్తకావిష్కరణ మహోత్సవ ఆహ్వానం**

షేక్. నసీమాబేగం ఆలోచనా తరువు నుంచి విరబూసిన
చిరునవ్వే చిగురించు (కవితా సంపుటి)

ముఖ్య అతిథి : పద్మశ్రీ డా. పసుపులేటి హనుమంతరావు, డెవలప్ మెంటల్ పిడియాట్రీషన్, రిహాబ్ పిడియాట్రీషన్, అండ్ రిహాబ్ సైకాలజిస్ట్ & స్వీకార్ వ్యవస్థాపక అధ్యక్షులు
మాన్య అతిథి : డా. నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు, మంజీరా రచయితల సంఘ వ్యవస్థాపకులు
పుస్తక ఆవిష్కర్త : డా. పి. నిర్మల రావ్, ప్రముఖ చిన్న పిల్లలవైద్య నిపుణులు
సభాధ్యక్షులు : డా. వెనిగళ్ల రాంబాబు, సినీగేయ రచయిత, విద్యావేత్త
విశిష్ట అతిథి : శ్రీ షఫీ, చలనచిత్ర నటులు
గౌరవ అతిథి : శ్రీ కార్తీక్ నిమ్మగడ్డ, కవి, రచయిత, తపస్వీ మనోహరం అధినేత
ఆత్మీయ అతిథులు : డా. తిరునగరి శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు, రచయిత
శ్రీ బైసా దేవదాసు, నేటినిజం పత్రిక సంపాదకులు
శ్రీమతి జి. కృష్ణవేణి, అడిషనల్ సెక్రెటరీ (రిటైర్డ్), సెక్రెటేరియట్ తెలంగాణ ప్రభుత్వం. అస్థిత్వం సంస్థ గౌరవ సలహాదారు
పుస్తక సమీక్ష : శ్రీమతి రోహిణి వంజారి, కవయిత్రి, రచయిత్రి, విమల సాహితీ సంపాదకురాలు
సభాసమన్వయం : డా. కృష్ణ, సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు & స్వీకార్ ప్రత్యేక విద్య విభాగపు ప్రిన్సిపల్

తేదీ : 24-10-2024 (గురువారం)
సమయం : ఉదయం గం॥ 10:30ని॥ల నుండి మధ్యాహ్నం గం॥ 12:30ని॥ల వరకు
వేదిక : స్వీకార్ మల్టీ స్పెషాలిటీ సెంటర్, సికింద్రాబాద్.


## గ్రూప్-1 అభ్యర్థుల మీద లాఠీచార్జిపై కేంద్ర మంత్రి సీరియస్

హైదరాబాద్, అక్టోబర్ 18: గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని ఆందోళనకు దిగిన అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అభ్యర్థులు పలువురు కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసానికి వెళ్లి కలుసుకున్నారు. మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయడంలో తమకు సాయం చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రూప్స్ అభ్యర్థుల ఆందోళనకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడం దారుణమని బండి సంజయ్ అన్నారు. న్యాయం కోరితే రక్తం కళ్లజూస్తారా అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో 29 గొడ్డలి పెట్టు అని ఆయన వ్యాఖ్యానించారు. గ్రూప్ ? 1 అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ -1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అశోక్ నగర్ నుంచి ఉద్యమం తెలంగాణ అంతా వ్యాపిస్తుందని హెచ్చరించారు. సమస్య తీవ్రం కాకముందే ప్రభుత్వం దిగిరావాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం అదేశాల మేరకు అశోక్ నగర్ వెళ్లి గ్రూప్-1 అభ్యర్థులను కలుసుకుంటానని చెప్పారు.

### షెడ్యూల్ ప్రకారమే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. దీంతో షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 21 నుంచి యథావిధిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. ప్రాథమిక కీలో తప్పులున్నాయనే పిటిషన్‌పై డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. గ్రూప్-1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లను అన్నింటినీ హైకోర్టు కొట్టి వేసింది.

## చిక్కుల్లో మహారాష్ట్ర సీఎం కుమారుడు.. మహాకాళీ టెంపుల్ రూల్స్ బ్రేక్

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడటంతో మహారాష్ట్ర రాజకీయాల్లో వేడి రాజుకుంది. అన్ని పార్టీల నేతలు వ్యూహ రచనల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ ఉజ్జయిని మహాకాళి ఆలయంలోని గర్భగుడిలోకి ఆయనను అనుమతించడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

దాంతో అధికారులు విచారణకు ఆదేశించారు. శ్రీకాంత్ శిండే థానే జిల్లాలోని కల్యాణ్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన గురువారం సాయంత్రం ఆ ఆలయానికి వెళ్లారు. భార్యతో కలిసి గర్భగుడిలోకి వెళ్లి పూజలు చేశారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. సుమారు ఏడాది కాలంగా ఆ ఆలయ గర్భగుడిలోకి ప్రవేశంపై నిషేధం ఉన్నా షిండేను లోపలికి అనుమతించడం విమర్శలకు దారితీసింది. సామాన్యులు దైవ దర్శనం కోసం గంటల కొద్ది క్యూలో నిలబడి వేచిచూస్తుంటే.. వీఐపీలను మాత్రం నిషేధం ఉన్నా గర్భగుడిలోకి అనుమతిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధమని మండిపడింది. ఉజ్జయిని జిల్లా కలెక్టర్, ఆలయ కమిటీ చైర్మన్ నీరజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. తాము ఎవరినీ గర్భగుడిలోకి అనుమతించలేదని చెప్పారు.

## 'కర్మయోగి శపథ్'-జాతీయ అభ్యాస వారాన్ని అక్టోబర్ 19న ప్రారంభించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: "కర్మయోగి శపథ్" – జాతీయ అభ్యాస వారాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు (అక్టోబర్ 19) ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారు. న్యూఢిల్లీ లోని డా. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. కర్మయోగి కార్యక్రమం సెప్టెంబర్ 2020లో ప్రారంభమైంది. అప్పటి నుంచి నేటి వరకు గణనీయమైన పురోగతిని సాధించింది. భారతీయత నిండిన, అంతర్జాతీయ దృక్పథం కలిగిన, భవిష్యత్తు కోసం సిద్ధమైన ప్రభుత్వ ఉద్యోగులను ఇది తయారుచేస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగులు తమ వ్యక్తిగత, సంస్థాగత సామర్థ్యాలు మెరుగుపరుచుకొనేలా ప్రేరణ ఇచ్చే అతి పెద్ద కార్యక్రమమే ఈ జాతీయ అభ్యాస వారం(ఎన్ఎల్‌డబ్ల్యూ). ఈ కార్యక్రమం నిరంతర అభ్యాసం చేసేలా, సామర్థ్యాలను పెంపొందించుకునేలా వారిని ప్రోత్సహిస్తుంది. 'ఒకే ప్రభుత్వం' అనే సందేశాన్ని, జాతీయ లక్ష్యాలను వారిలో నింపి నిరంతరం నేర్చుకునే దృక్పథాన్ని పెంపొందించడమే ఎన్ఎల్‌డబ్ల్యూ లక్ష్యం.

వ్యక్తులు, మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలకు వివిధ పద్ధతుల ద్వారా నేర్చుకునే అవకాశాన్ని ఎన్ఎల్‌డబ్ల్యూ కల్పిస్తుంది. ఈ వారం రోజుల వ్యవధిలో ప్రతి కర్మయోగి కనీసం నాలుగు గంటల అభ్యాస లక్ష్యాన్ని సాధించాల్సి ఉంటుంది. దీనిలో పాల్గొనేవారు తమకు నిర్దేశించిన లక్ష్యాన్ని ఐజీవోటీ, వెబినార్ (పబ్లిక్ లెక్చర్లు, పాలసీ మాస్టర్ క్లాసులు)లో పాల్గొనడం ద్వారా సాధించవచ్చు. ఈ వారంలో ప్రముఖ వక్తలు తాము ప్రావీణ్యం సాధించిన అంశాలపై చర్చలు నిర్వహిస్తారు. ప్రభావవంతమైన పద్ధతిలో పౌరకేంద్రక సేవలను అందించేందుకు సహకరిస్తారు. అలాగే మంత్రిత్వ శాఖలు, వివిధ విభాగాలు, సంస్థలు నిర్దేశిత అంశాలపై సెమినార్లు, వర్క్ షాపులు నిర్వహిస్తాయి.

## మూసీ నది పునరుజ్జీవాన్ని వ్యతిరేకించం - తేల్చి చెప్పిన కిషన్ రెడ్డి

-మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ కట్టాలి
-డ్రెయినేజీ వాటర్ కలవకుండా చర్యలు తీసుకోవాలి
-డ్రెయిన్ సమస్య పరిష్కరించకుంటే సుందరీకరణ అసాధ్యం
-పేదల ఇండ్లను కూల్చకుండానే పనులు చేయొచ్చు
-సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచన

హైదరాబాద్, అక్టోబర్ 18: మూసీ సుందరీకరణ చేసినా, పునరుజ్జీవం చేసినా అందుకు తాము వ్యతిరేకం కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే ముందుగా మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలని, డ్రైనేజీ



వాటర్ అందులో కలువకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

పేదల ఇళ్ల కూల్చొద్దు!

పేదల ఇళ్లను కూల్చకుండా మూసీ సుందరీకరణ చేయవచ్చుని, ఆ తర్వాతే మూసీ పునరుజ్జీవం చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మంచినీరు డ్రైనేజీల్లో కలుస్తూ వృథా అవుతున్నాయని, అలాంటి సమస్యల్ని పరిష్కరించాలని తెలిపారు. నగరంలో డ్రైనేజీల సమస్యను పరిష్కరించకుండా మూసీ సుందరీకరణ సాధ్యం కాదని కిషన్ రెడ్డి అన్నారు.

## నేడు నాగన్నకు సుద్దాల హనుమంతు-జానకమ్మ పురస్కారం

### - హైదరాబాద్ భాగ్ లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో అందజేయనున్న సుద్దాల ఫౌండేషన్

ఖమ్మం, అక్టోబర్ 18: (నేటినిజం ప్రతినిధి): గత ఐదు దశాబ్దాలుగా ప్రజల పాటలే తన ఉచ్ఛ్వాస నిస్వాసాలుగా రాజీ పడని పాటకు వెయ్యేళ్ళని నమ్మిన ప్రజా గాయకుడు. పేదరికం చుట్టుముట్టినా చెక్కు చెదరని సాంస్కృతిక విప్లవోద్యమ రథసారథి. ప్రజా వాల్మీకిలా ప్రజ్వలిస్తున్న గాయక నాయకుడు, ప్రజా గాయకుడు. సాంస్కృతిక విప్లవోద్యమంలో అరుణోదయమే తన ఇంటి పేరుగా ప్రజల నాలుకలపై తేలియాడుతున్న అరుణోదయ నాగన్నను 2024సం వత్సరానికి సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారం వరించింది. నాగన్న స్వగ్రామం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారం. కల్లుగీత కార్మిక కుటుంబంలో జన్మించిన నాగన్న అమరుడు శ్రీపాద శ్రీహరి తన స్వగ్రామం కావటం ఆయన స్ఫూర్తితో విప్లవోద్యమంలో చురుకైన కార్యకర్తగా ప్రజా గాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1976నుండి సిపిఐ ఎంఎల్ పార్టీలో చేరి తన జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారు. తన జీవిత భాగస్వామి లక్ష్మి(లక్ష్మక్క)తో అరుణోదయ సాంస్కృతిక విప్లవోద్యమంలో భాగస్వాములు అయ్యారు. నాటి నుండి నేటి వరకు వారిరువురూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తమ జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారు. నాగన్న పాట ఒక తూటాలాగా పేలుతుంది. విప్లవోద్యమంలో ఆయన ఆటపాట యువతరాన్ని ఉర్రూతలూగిస్తుంది. కటిక పేదరికం అనుభవిస్తూ ప్రజలతో మమేకమై పోలీసుల లాఠీల తూటాలకు నెరవకుండా కతం తొక్కి వదం పాడుతూ పోరాటంలో ముందుండి ప్రజలకు ఆదర్శంగా నిలిచాడు. ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ అరుణోదయ నాగన్న

సాంస్కృతిక విప్లవోద్యమానికి నాగన్న జీవితం ఉత్ప్రేరకం. ఖమ్మం జిల్లా ముద్దు బిడ్డ అయినటువంటి అరుణోదయ నాగన్న గత కొన్ని



దశాబ్దాల కాలంగా సాంస్కృతిక విప్లవోద్యమంలో అలుపెరుగని పోరాట యోధుడు విప్లవోద్యమంలో ఆయన పోరాటపటిమ, శక్తి వెలకట్టలేనిది ఆయన పాటకు ఎంతో శక్తి ఉన్నది నాగన్నతో పాటు ఆయన సతీమణి లక్ష్మక్క ఇరువురు విప్లవ పార్టీలో ప్రజల పక్షాన జరిగేటువంటి పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని తమ జీవితాలను ప్రజలకే అంకితం చేశారు. వారితో పాటు వారి ఏకైక కుమారుడు అజయ్ కూడా సంస్కృతిక విప్లవద్యమంలో పనిచేశారు. అరుణోదయ నాగన్న అంటే రెండు తెలుగు రాష్ట్రాలలో తెలియని వారు లేరు. ప్రతి పల్లెలోనూ ట్రాక్టర్ల పై వినిపించే ఆడియో పాటలు ఆయన స్వరం నుండే మార్మోగుతుంటాయి. ప్రస్తుతం నాగన్న కుటుంబం అతి పేదరికం అనుభవిస్తుంది. అంతటి పేదరికంలో కూడా సాంస్కృతిక విప్లవోద్యమాన్ని వదిలిపెట్టకుండా తమ గళాన్ని జీవితాన్ని ప్రజలకే అంకితం చేశారు. ఆయన పాట ఆటవిప్లవద్యమానికి ఉత్ప్రేరకమైనది. ప్రస్తుతం నాగన్న ఆరోగ్యం ఇంటికే పరిమితమైంది. నాగన్న జీవితాన్ని అధ్యయనం చేసిన సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ సినీ గేయ రచయిత డా.సుద్దాల అశోక్ తేజ నాగన్న ప్రతిభను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. తమ తల్లిదండ్రుల పేరు మీద ప్రతి ఏటా ప్రముఖులకు ఇచ్చేటువంటి ఎంతో ప్రతిష్టాత్మకమైన టువంటి ఈ అవార్డు సుద్దాల హనుమంతు-జానకమ్మల జాతీయ పురస్కారానికి నాగన్నను ఎంపిక చేశారు. ఇప్పటివరకు గద్దర్, గోరేటి వెంకన్న, నారాయణమూర్తి, జయరాజు, అందెశ్రీ, విమలక్క లాంటి 12మంది ప్రముఖులు ఎంపిక అయ్యారు. ఈనాటి ఈ ఎంపిక రెండు తెలుగు రాష్ట్రాలకి ఎంతో గర్వకారణం.

– నాగన్న ఇంటికి వచ్చి ఆహ్వానం పలికిన సుద్దాల ఫౌండేషన్

సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారానికి నాగన్న ఎంపిక అనంతరం సుద్దాల ఫౌండేషన్ కమిటీ స్వయంగా ఖమ్మంలోని నాగన్న ఇంటికి వచ్చి ఆహ్వానం పలికారు. తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసామని హైదరాబాదులో ఈ నెల 19న బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో పురస్కారాన్ని అందజేయనున్నామని తెలిపారు. ఈ మేరకు సుద్దాల అశోక్ తేజ, కమిటీ సభ్యులు నాగన్నను సత్కరించి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నాగన్న దంపతులు డాక్టర్ అశోక్ తేజకు శాలువా కప్పి సత్కరించారు. హైదరాబాద్ లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో ఈ అవార్డును అందజేయనున్నారు. ఈనెల 19న సాయంత్రం 6గంటలకు రాష్ట్ర పూర్వ ప్రభుత్వ సలహాదారులు సుద్దాల సుధాకర్ తేజ అధ్యక్షతన జరిగే సభలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారంను నాగన్నకు అందజేయనున్నారు

## భారీ వర్షంలోనూ గుప్త నిధుల వేట !

అమరావతి, అక్టోబర్ 18: శ్రీ సత్యసాయి జిల్లాలో గుప్తనిధుల తవ్వకం కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఏకంగా జేసీబీతో గుప్త నిధుల కోసం ఎగబడ్డారు. కానీ వీరు ఎంత ప్రయత్నించినా గుప్త నిధి జాడ దొరకలేదు. ఆ ఊరి జనం దేవుడిగా కొలిచే బండరాయిని జేసీబీతో చెరబట్టిన ఈ దుండగుల అకృత్యం.. జనాల్లో కలవరం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. బత్తలపల్లి మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటప చోటు చేసుకుంది. అప్పరాచెరువు గ్రామంలోని చెరువు మరువ కట్ట సమీపాన అపరాధయ్య స్వామిగా కొలిచే పెద్ద బండరాయిని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వేశారు.

తుఫాను ప్రభావంతో భారీ వర్షం కురుస్తుంటే.. జనం ఇళ్లకే పరిమితం కాగా.. దుండగులు తమ పని కానిచ్చేశారు. పోతులయ్య స్వామి గుడి సమీపంలోని అపరాధయ్య స్వామి బండను తొలగించి దాదాపు 20 అడుగుల గుంతను తవ్వారు. అపరాధయ్య స్వామి బండ కింద అమూల్యమైన బంగారు నిధులు ఉన్నట్లు కథనాలు ఉన్నాయి.

గతంలోనూ అనేక సార్లు అపరాధయ్య స్వామి బండను తొలగించడానికి విఫల ప్రయత్నాలు జరిగాయి. ఈ సారి ఏకంగా జేసీబీ సహాయంతో పెద్ద పెద్ద బండరాలను తొలగించారు. గుప్త తవ్వకాల ముందు మాంత్రికులతో క్షుద్రపూజలు నిర్వహించారు. రహదారి వెంబడి మంత్రించిన కొర్రలను చల్లారు.

గత రెండు మూడు రోజుల నుంచి కొత్త వ్యక్తులు కార్లలో సంచరించిన వారే రెక్కీ నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది, ఈ విషయం బయటకు పొక్కటంతో శుక్రవారం ఉదయాన్నే గ్రామస్తులు ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు.

పోలీసులు ఈ ప్రదేశం సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. సీసీ పుటేజీల్లో కొత్త వ్యక్తుల సంచారం కనిపించలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్సై సోమశేఖర్ ను వివరణ కోరగా గుప్త నిధుల తవ్వకాల ఉదంతం తమ దృష్టికి వచ్చిందని, గ్రామంలో పరిస్థితిని సమీక్షించామని, ఈ కేసును మరింత లోతుగా విచారిస్తామన్నారు.

# ఎన్డీయే హయాంలో ఏపీ సమగ్రాభివృద్ధి.. ఎంపీ కేశినేని చిన్ని

-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో..
-అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పన?
-మధురానగర్ ఆర్.యు.బి ప్రారంభం..

అమరావతి, అక్టోబర్ 18: ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని విజయవాడ



పార్లమెంట్ సభ్యుడు కేసినేని శివనాథ్ పేర్కొన్నారు. మధురా నగర్ వాసుల చిరకాల కల ఆర్.యు.బి ని ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి పనులు వెంటనే పూర్తి చేసి ఆర్.యు.బి ని అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ఎన్డీయే కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్డీయే కూటమి అభివృద్ధికి చిరునామాగా నిలుస్తోందని చెప్పారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో మధురనగర్ ? భాను నగర్ రైల్వే ఆర్.యు.బి రహదారిని శుక్రవారం ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు.

ముందుగా ఆర్.యు.బి రహదారి దగ్గర ఏర్పాటు చేసిన శిలాపలాకాన్ని ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఆవిష్కరించి, అనంతరం రిబ్బన్ కట్ చేసి ఆర్.యు.బి రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మీడియా మాట్లాడుతూ? సెంట్రల్ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనుల్లో తాను కూడా భాగస్వామ్యం అవుతాననీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. సెంట్రల్ నియోజకవర్గం, పశ్చిమ నియోజకవర్గంలో వి.ఎం.సి, రైల్వే వారితో అనుసంధానం గా వున్న పనులు చాలా పెండింగ్ లో వున్నాయని, ఆ పనులు వెంటనే పూర్తి చేసేందుకు వి.ఎం.సి అధికారులతో మాట్లాడాలని రైల్వే అధికారులకు చెప్పటం జరిగిందన్నారు.

మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులతో కలిసి జాయింట్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధురానగర్ లో రైల్వే శాఖతో ముడిపడి వున్న ల్యాండ్ ఇష్యూ పై త్వరలో ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి రైల్వే అధికారులు, వి.ఎం.సి అధికారులతో మాట్లాడతామన్నారు. సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల్లో రోడ్లు, ఆర్.యు.బి, ఆర్.వో.బిలకు శంకుస్థాపన 2014-2019 కాలంలోనే జరిగిందని, గత ప్రభుత్వం మొద్దు నిద్రపోయి, వీటిని నిర్లక్ష్యం చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకి గురి చేసిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్.యు.బి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించటం జరిగిందన్నారు.

అంతకు ముందు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ మధురానగర్ వాసుల చిరకాల కల నేడు నెరవేరిందన్నారు. ఆర్.యు.బి నిర్మాణానికి టీడీపీ హయంలో నాటి ఎమ్మెల్యేగా తాను శంకుస్థాపన చేశానని, ఇప్పుడు ప్రారంభోత్సవం టీడీపీ పాలనలోనే జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్ యు బి నిర్మాణం సకాలంలో చేపట్టకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టిందన్నారు. తొమ్మిది నెలల కాలంలో పూర్తి కావలసిన ఆర్.యు.బి నిర్మాణం వైసీపీ పాలనలో అటకెక్కిందన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువ జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆర్ యు బి నిర్మాణం పూర్తయిందన్నారు. అదేవిధంగా గుణదల దగ్గర ఆగిపోయిన ఫ్లైఓవర్ కూడా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు, ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) సహకారంతో రైల్వే అధికారులతో మాట్లాడి వాంబే కాలనీ వద్ద కూడా ఆర్ యు బి నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్ బొలిశెట్టి వంశీ కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సెంట్రల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, 28వ డివిజన్ కార్పొరేటర్ వీరమాచినేని లలిత, 29వ డివిజన్ ప్రెసిడెంట్ పి వెంకటేశ్వరరావు, 29వ డివిజన్ ఇంచార్జి గౌతమ్ ప్రసాద్, టీడీపీ నాయకులు వీరమాచినేని కిషోర్, సింగం వెంకన్న, అంగిరేకుల రాంబాబు, తుంగం ఝాన్సీ, జనసేన నాయకులు శ్యామ్ ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఈఈ చంద్రశేఖర్, డీఈఈ గురునాథ్ బాబు, ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ భర్త పై దాడి..

ఆదిలాబాద్, అక్టోబర్ 18: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం రాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మాజీ ఎంపీపీ భర్త శ్రీనివాస్ పై దాడి చేసిన సంఘటన నెలకొంది. అదే మండలం నర్సింగాపూర్ గ్రామం నుండి రాపల్లి వైపు ప్రయాణిస్తున్న ఎంపీపీ భర్త శ్రీనివాస్ కారు వెనకాల వస్తున్న మోటార్ సైకిల్ కు కారు డోరు తగిలి కింద పడగా రాపల్లి గ్రామానికి చెందిన యువకులు వారి కుటుంబీకులకు ఫోన్ చేయగా అక్కడికి వచ్చిన వారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా మాజీ ఎంపీపీ భర్త పై దాడి చేశారు.


దాడిలో తీవ్రంగా గాయపడ్డ మందపల్లి శ్రీనివాస్ ను అటుగా వచ్చిన స్థానికులు మంచిర్యాల ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. చికిత్స జరుగుతున్న సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసులు మందపల్లి శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకుంటామని చెప్పడంతో అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, బీఆర్ఎస్ నాయకులకు పోలీసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. మందపల్లి శ్రీనివాస్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం హాజీపూర్ పోలీస్ స్టేషన్ తరలించారు.

# రోడ్డు ప్రమాదంలో అటవీ ఉద్యోగి మృతి

అమరావతి, అక్టోబర్ 18: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు, అటవీశాఖ ఉద్యోగుల వాహనాలపై దూసుకొచ్చిన లారీ కారణంగా ఓ అటవీశాఖ ఉద్యోగి (ఈనీతీవబబి ఇఎజూశ్రీనీఎ ఆతివట) మరణించాడు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి వద్ద జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

కర్రల లోడ్ ట్రాక్టర్‌ను రోడ్డుపక్కన ఆపి పోలీసులు మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన గ్యాస్ సిలిండర్ల లారీ పోలీసు వాహనం, ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. దీంతో పోలీసు వాహనంలో ఉన్న అటవీ శాఖ ఉద్యోగి వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు కానిస్టేబుళ్లకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రికి తరలించారు

# న్యూఢిల్లీలో 2023 బ్యాచ్ (76 ఆర్ఆర్) ఐపీఎస్ ప్రొబేషనర్లతో సంభాషించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా




న్యూఢిల్లీ, అక్టోబర్ 18: కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో 2023 బ్యాచ్ (76 ఆర్ఆర్) ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) ప్రొబేషనర్లతో సంభాషించారు. ఈ సందర్భంగా, ట్రైనీ ఐపీఎస్ అధికారులు తమ శిక్షణకు సంబంధించిన అనుభవాలను కేంద్ర హోంమంత్రితో పంచుకున్నారు. కేంద్ర హోం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్వీపీ ఎన్పీఏ) డైరెక్టర్ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర హోం సహకార మంత్రి మాట్లాడుతూ 2047లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ ఉగ్రవాద రహిత, మాదకద్రవ్యాల రహిత దేశంగా మారుతుందని, దేశ అంతర్గత భద్రత పూర్తి బలోపేతం అవుతుందన్నారు. మానవ హక్కులు, పౌరుల హక్కుల పరిరక్షణకు పూర్తి భరోసా ఉంటుందని పేర్కొన్నారు. ఐపీఎస్ కావాలని ఎందుకు అనుకునదీ గుర్తుంచుకుని, అందుకు అనుగుణంగా ట్రైనీ ఐపీఎస్ అధికారులు బాగా పనిచేయాలని అమిత్ షా సూచించారు. గత 75 బ్యాచ్‌ల కంటే ఈసారి ఐపీఎస్‌లుగా బాధ్యతలు చేపట్టనున్న బ్యాచ్‌పై మరింత పెద్ద బాధ్యత ఉంటుందని ట్రైనీ అధికారులు తెలుసుకోవాలన్నారు. ప్రస్తుత స్థాయిని మెరుగుపర్చుకుని మన దేశం తదుపరి తరం పోలీసింగ్‌లోకి ప్రవేశిస్తుందా లేదా అనేది పూర్తిగా వారి చేతుల్లో, వారి తర్వాత వచ్చే బ్యాచ్‌ల చేతుల్లోనే ఉందని ట్రైనీ అధికారులు గుర్తించాలని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

మన సరిహద్దులను, మన సైన్యాన్ని అవమానించే ధైర్యం ఇప్పుడు ఎవరికీ లేదని దేశ హోం మంత్రిగా తాను కచ్చితంగా చెప్పగలనని శ్రీ అమిత్ షా అన్నారు. మన సరిహద్దులకు పటిష్టమైన భద్రత కల్పించేందుకు చాలా కృషి చేశామని, ఇంకా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇంతకుముందు జమ్మూ కాశ్మీర్, ఈశాన్య ప్రాంతం, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలనే మూడు పుండ్లు ఉండేవి, కానీ ఇప్పుడు ఈ మూడు ప్రదేశాలలో హింసను 70 శాతం తగ్గించడంలో విజయం సాధించామని శ్రీ అమిత్ షా తెలిపారు. ఈ మూడు సమస్యాత్మక ప్రాంతాల్లో నేడు భారత భద్రతా సంస్థలు పూర్తి ఆధిపత్యాన్ని కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఇప్పుడు మార్పు కోసం డిమాండ్లు, ఆకాంక్షలు రెండింటినీ చేసే సంస్కృతి పూర్తిగా తగ్గిపోయిందని, దీని కారణంగా గతంలో లాగా పెద్దఎత్తున నిరసనలు ఇప్పుడు లేవని శ్రీ అమిత్ షా తెలిపారు.

మన పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడేందుకు పోలీసు వ్యవస్థ ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందనీ, దేశ సరిహద్దుల్లో జరుగుతున్న నేరాలను తగ్గించేందుకు పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంమంత్రి సూచించారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో పౌరులకు న్యాయం అందించాల్సిన సమయం వచ్చిందన్నారు.

ఈరోజు క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) ద్వారా దేశంలోని 99శాతానికి పైగా పోలీస్ స్టేషన్‌లు ఇంటర్నెట్ ద్వారా అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆన్‌లైన్ డేటా సైతం రూపొందించామనీ, మూడు కొత్త చట్టాల ద్వారా అనేక నిబంధనల్లో సమూల మార్పులు చేసినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. సకాలంలో న్యాయం అందించడం, నేర నిరూపణకు అవకాశం, సాంకేతికతను గరిష్టంగా ఉపయోగించడం వంటి వాటికి కొత్త చట్టాల్లో ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. శాస్త్రీయ సాక్ష్యాలను తప్పనిసరి చేసినందున, ప్రాసిక్యూషన్ బహుళ సాక్షులను సమర్పించాల్సిన అవసరం లేకుండా ఇప్పుడు శాస్త్రీయ ఆధారాల ఆధారంగానే నేరాన్ని రుజువు చేయవచ్చని పేర్కొన్నారు.

కొత్త చట్టాల్లో న్యాయ ప్రక్రియను కాలపరిమితితో రూపొందించినట్లు కేంద్ర హోంమంత్రి తెలిపారు. రాబోయే 5 సంవత్సరాల్లో సాంకేతికత, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, శిక్షణతో సహా దేశంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో కొత్త చట్టాలు పూర్తిగా అమలు అవుతాయన్నారు. ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలో న్యాయ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. కొత్త చట్టాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందుపరిచామనీ, రానున్న 100 ఏళ్లలో సాంకేతికతలో వచ్చే మార్పులనూ దృష్టిలో ఉంచుకుని ఈ చట్టాలను రూపొందించినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. ఇ-సమన్లకు ఉదాహరణ ఇస్తూ.. రాబోయే 100 ఏళ్ల సాంకేతికతను ఇందులో పొందుపరిచేలా నిబంధనలు తెచ్చామని, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కోసం నిబంధనలు రూపొందించామనీ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) తప్పనిసరి చేశామన్నారు. ఒక అధికారి తన విధుల విషయంలో రాజీపడినా, శాస్త్రీయ ఆధారాల కారణంగా అతను న్యాయస్థానం ముందు ఏమీ చేయలేనందున ఎవరూ ఎవరికీ అనుకూలంగా వ్యవహరించలేరని పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఎల్ నివేదిక నేరుగా న్యాయస్థానానికి చేరుతుందని, దానికి సంబంధించిన ఒక కాపీ పోలీసుల నుంచి కూడా వస్తుందని తెలిపారు.

మూడు కొత్త చట్టాలలో పౌరుల హక్కుల భద్రతకు ప్రాధాన్యమిచ్చినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తుల సంఖ్యను ఆన్‌లైన్‌లో ప్రకటించాల్సి ఉంటుందన్నారు. ఛార్జిషీట్‌ను 90 రోజుల్లోగా దాఖలు చేయాలనీ, సోదాలు, జప్తుల దృశ్యాలను వీడియో తీయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నేషనల్ ఆటోమేటెడ్ ఫింగర్‌ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఎన్ఏఎఎఫ్ఐఎస్)పై వేలిముద్రల డేటాతో పాటు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల డేటాను విడిగా రూపొందించినట్లు తెలిపారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) సైతం సీసీటీఎన్ఎస్ డేటా మొత్తాన్ని మరో విధంగా నిర్వహిస్తోందన్నారు. జాతీయ స్థాయిలో డేటా బ్యాంక్‌ను రూపొందించే పని జరుగుతోందని తెలిపారు. ఇప్పుడు నేరాల విశ్లేషణకు సహాయపడే సాఫ్ట్‌వేర్‌ను కృత్రిమ మేధ సాయంతో రూపొందించి మీ పనిని మరింత సులభతరం చేయడానికి హోం మంత్రిత్వ శాఖ బృందం కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

దేశ భద్రత అంటే సరిహద్దు భద్రత మాత్రమే కాదని కేంద్ర హోంమంత్రి అన్నారు. దేశం దాని పౌరులతో నిర్మితమైందనీ, పౌరుల భద్రతే దేశ భద్రతకు ఆధారం అవుతుందని పేర్కొన్నారు. తాను భద్రత గురించి మాట్లాడేటప్పుడు అది ప్రాణ, ఆస్తుల భద్రతే కాదనీ, మన రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కుల భద్రత కూడా ఇందులోకి వస్తుందన్నారు. రాజ్యాంగంలో దేశ ప్రధానితో సమానంగా పేదలకు హక్కులున్నాయనీ, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపైనే ఉంటుందని శ్రీ అమిత్ షా తెలిపారు. 75 ఏళ్ల తరువాత, మన ప్రధాన బాధ్యతపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పుడు పౌర హక్కులను పరిరక్షించడానికి, వారిపై అఘాయిత్యాలను నివారించడానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పేదలు, పిల్లలు, మహిళల హక్కులను పరిరక్షించడం ప్రధానమని కేంద్ర హోంమంత్రి తెలిపారు. కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ప్రొబేషనర్లతో మాట్లాడుతూ మెరుగుపరచలేని పని ఏదీ లేదనీ, అలాగే తక్కువ ప్రాధాన్యం గల పని సైతం ఏదీ లేదన్నారు. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుంటే జీవితంలో నిరాశకు దూరంగా ఉండవచ్చన్నారు. జిల్లా స్థాయిలో పని చేస్తున్నపుడు చేసిన మంచి పనులకు ప్రజలు నుంచి లభించే అభిమానానికి మించిన పతకం ఏదీ ఉండదని, చిన్న వయస్సులోనే ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించిన పోలీసు అధికారికి ఇది ఓ గొప్ప అనుభవంగా గుర్తుండిపోతుందన్నారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలను నిర్మూలించేందుకు యువ అధికారులంతా శక్తివంచనలేకుండా పని చేయాలని శ్రీ అమిత్ షా సూచించారు. పోలీసుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో దేశ భద్రత ఎల్లప్పుడూ మన మనస్సులో ఉండాలనీ, దేశ రక్షణ కోసం సదా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోం మంత్రి సూచించారు.

# విశాఖలో మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్..

-44వ రోజు ప్రజాదర్బార్ లో ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ
-మంత్రిని కలిసిన పలువురు నాయకులు, కార్యకర్తలు

విశాఖపట్నం, అక్టోబర్ 18: విశాఖ తన రెండు రోజుల పర్యటనలో భాగంగా విశాఖ చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. శుక్రవారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో 44వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



బర్మా కాందిశీకుల భూములు అన్యాక్రాంతం చేస్తున్న వారు, అందుకు మద్దతిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, తమకు ఆయా భూముల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని బర్మా ఆంధ్రా కాందిశీకుల కేంద్ర సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బర్మా కాందిశీకులు, వారి సంతతి 7వేల కుటుంబాలకు పైగా విశాఖకు తరలివచ్చాయి. తమకు ఉద్యోగం, వ్యాపార రుణాలు, ఇల్లు నిర్మించి ఇస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

2013 ఏడాది ఆర్టీసీ రిక్రూట్మెంట్ డ్రైవర్లను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ ఆర్టీసీ డ్రైవర్లు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. విశాఖ రీజియన్ లో 2013లో ఎంపికైన తమను 2022లో విధుల్లోకి తీసుకున్నారు. దీంతో సర్వీసు చాలా నష్టపోయాం. గత వైసీపీ ప్రభుత్వంలో తమకు పీఆర్సీ కూడా అమలుచేయలేదు. ఉద్యోగ భద్రత లేక ఆందోళన చెందుతున్నామని, పీఆర్సీ వర్తింపజేయడంతో పాటు తమను క్రమబద్ధీకరించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

విశాఖ భీమునిపట్నంలో మొత్తం నగదు చెల్లించి తాము కొనుగోలు చేసిన 78 సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా వైసీపీ అండతో అక్రమాని వెంకటరావు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, విచారించి తగిన న్యాయం చేయాలని నకెళ్లా సోమరాజు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

గత వైసీపీ పాలనలో చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్ట్ వార్త విని తన భర్త గుండెపోటుతో మరణించాడని, దీంతో తమ కుటుంబానికి ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కండపాలెంకు చెందిన ముచ్చకర్ల ధారాలక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. వడ్డాది కేజీబీవీ నందు ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

అధికారులు చేసిన తప్పునకు న్యాయం కోసం పడిగాపులు కాస్తున్నానని విశాఖ రూరల్ కు చెందిన కే.చిన్నారావు మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. 2012లో వుడా అనుమతులు ఉన్న 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాను. 1981లో సొసైటీకి దాఖలైన సదరు భూమిని 35 ఏళ్ల దర్వాత నిషేధిత జాబితాలో చేర్చారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన నగదును కుమార్తెల వివాహం కోసం అగ్రిగోల్డ్ లో పొదుపుచేశానని, సంస్థ బోర్డు తిప్పేయడంతో రోడ్డున పడ్డామని శ్రీకాకుళానికి చెందిన గంగాడ కొర్లమ్మ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి ఆధారం లేదని, తమ డిపాజిట్ తిరిగి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

ఇంజనీరింగ్ చదివిన తనకు ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖకు చెందిన బత్తుల దుర్గా ప్రణీత్ విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన ఉద్యోగం కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. బీసీఏ కంప్యూటర్స్, ఎంబీయే చదివిన తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖకు చెందిన అనసూరి మధుసూదనరావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

షెడ్యూల్ కులానికి చెందిన తనకు రేషన్ దుకాణం మంజూరు చేసి ఆదుకోవాలని విశాఖ కంచరపాలెంకు చెందిన మొర్ల రాజారావు కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ ను పలువురు నాయకులు, కార్యకర్తలు కలిశారు. అనంతరం వారితో ఫోటోలు దిగారు.

# అశోక్ నగర్ పేరు వింటేనే రేవంత్ రెడ్డికి భయమేస్తోంది.. నిప్పులు చెరిగిన జగదీశ్ రెడ్డి




హైదరాబాద్, అక్టోబర్ 18: నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడే అదే అశోక్ నగర్, నిరుద్యోగుల పేరు వింటే ఆయనకు భయమేస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి నిప్పులు చెరిగారు. రాష్ట్ర అప్పులు, గ్రూప్-1 అంశంతో పాటు మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.

రేవంత్ వ్యాఖ్యలు సీఎం స్థాయిని దిగజార్చేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రజల పరువు పోయేలా రేవంత్ ఉపన్యాసాలు ఉన్నాయి.

రేవంత్ వ్యక్తిగా పరువు పోగొట్టుకుంటే ఫర్వాలేదు.. కానీ తెలంగాణ సీఎంగా పరువు పోతే ఎవరికి నష్టం.. ఎవరో రాసిచ్చిన పాఠం చదవడం రేవంత్ మానేస్తే మంచిది. సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు.

తెలంగాణ ఆదాయాన్ని పెంచింది కేసీఆర్ అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. 2014 బడ్జెట్ ఇప్పటి బడ్జెట్ చూస్తే ఎవరు ఆదాయం పెంచారో తెలుస్తుంది.

అప్పులు మంత్రుల జేబులో నుండి కడుతున్నట్లు అతితెలివిగా మాట్లాడుతున్నారు. మేము కూడబెట్టిన ఆదాయం నిలబడితే చాలు. 420 హామీలొద్దు.. కేసీఆర్ పథకాలైనా ఇస్తే చాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ఆదాయం , అప్పులపై చర్చకు సిద్ధమే అని జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు.

సెక్యూరిటీ లేకుండా సీఎం మూసీ ప్రాంతంలో తిరిగి చూపించాలిరగాలి. మూసీ కూల్చివేతల తరవాత సెక్యూరిటీ పెంచుకుని ప్రగల్భాలు పలుకుతున్నారు.

అశోక్ నగర్ నిరుద్యోగుల వల్లే రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. మరి ఇప్పుడు అశోక్ నగర్ పేరు వింటే రేవంత్‌కి భయమేస్తోంది.

అశోక్ నగర్‌లో పోలీస్ నిర్బంధం దేనికి..? యువత ఆవేశం ఇలానే కొనసాగితే తెలంగాణ మొత్తం అశోక్ నగర్‌లే అవుతాయి. నిర్బంధం పెట్టే బదులు అనుమానాలు నివృత్తి చేయండి. కాంగ్రెస్ సీనియర్లే సీఎం ఏకపక్షంగా వెళ్తున్నారని అంటున్నారు. ఇప్పటికే ప్రజల నుండి దూరమౌతున్న రేవంత్.. తన దూకుడు మానుకోకపోతే కాంగ్రెస్ పార్టీకి దూరం కాక తప్పదని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం (డీఏ), పింఛన్ దారులకు డియర్ నెస్ రిలీఫ్ (డీఆర్) లలో 3 శాతం అదనపు వాయిదా (ఇన్ స్టాల్ మెంట్) చెల్లింపునకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం (డీఏ), పింఛన్ దారులకు డియర్ నెస్ రిలీఫ్ (డీఆర్) ల అదనపు వాయిదా (ఇన్ స్టాల్ మెంట్) ను జులై 1 నుంచి చెల్లించడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదాన్ని తెలిపింది. ఇది మూల వేతనం లేదా పింఛన్ లో ఇప్పుడు వర్తిస్తున్న 50 శాతం రేటు కన్నా మూడు శాతం అధికం. ధరలలో పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని, ఆ భారాన్ని తొలగించడానికి ఈ చర్యను తీసుకొన్నారు.

ఈ పెంపు ఏడో కేంద్ర వేతన సంఘం సిఫారసుల ఆధారంగా ఆమోదించిన ఫార్ములా కు అనుగుణంగా ఉంది. తాజా నిర్ణయం ఫలితంగా డీఏ, డీఆర్ లలో పెరుగుదల మూలంగా ఖజానాపై సంవత్సరానికి పడే భారం రూ. 9,448.35 కోట్లు.

ఈ నిర్ణయంతో దాదాపుగా 49.18 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 64.89 లక్షల మంది పెన్షనర్ లకు ప్రయోజనం కలుగుతుంది.

# గుంటూరు జిల్లాలో విషాదం.. రైలు కింద పడి ప్రేమికుల ఆత్మహత్య

అమరావతి, అక్టోబర్ 18: ప్రేమ వివాహానికి యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలుపడంతో ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన గుంటూరు జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని పెదకాకాని గ్రామానికి చెందిన దానబోయిన మహేశ్(22), నందిగామ మండం రుద్రవరానికి చెందిన శైలు(21) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని యువకుడి కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించగా, యువతి తరుపు కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

దీంతో దసరా సమయంలో ఇద్దరు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. శుక్రవారం పెదకాకాని సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతుల వద్ద ఉన్న సమాచారం ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఇందిరా మహిళ డెయిరీ ప్రాజెక్టును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి:జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




ఖమ్మం, అక్టోబర్ 18: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరా డైరీపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ...మధిర అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేసుకొని దసరా పండుగ నాడు ఎర్రుపాలెం మండలంలో ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా పాల శీతలీకరణ యూనిట్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా డైరీ, ఎర్రుపాలెం మండల మహిళా సమాఖ్య గ్రామంలో పాలు సేకరించి విజయ డైరీకి తరలించడం జరుగుతుందని, వీరికి సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు చేయడం జరుగుతుందని అన్నారు. మధిర నియోజకవర్గం పరిధిలో పాల ఉత్పత్తి పెంచే దిశగా గేదె, గడ్డి షెడ్డు ఉన్న పాడి రైతులకు పాడి పశువులు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మధిర అసెంబ్లీ పరిధిలోని ఐదు మండలాల్లో ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సర్వే నిర్వహించి పాడి రైతులను గుర్తించారని, వీరికి పశువులు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ లోపు పాడి రైతులకు పశువులు పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలని, పాల ఉత్పత్తిని అంచనా వేస్తూ దానికి తగిన విధంగా పాల సేకరణ కేంద్రాలు, ఇతర సదుపాయాల కల్పనకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి మండలంలో పాల ఉత్పత్తి అధికంగా ఉన్న గ్రామాలలో ముందుగా పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇక్కడి నుంచి బి.ఎం.సి పాల తరలింపు రూట్ లను గుర్తించాలని అన్నారు. పాల ఉత్పత్తికి అనుగుణంగా పాల శీతలీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించి అవసరమైన మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద పాల సేకరణ కేంద్రాలకు, పాల శీతలీకరణ కేంద్రాలకు అప్రోచ్ రోడ్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. 48గంటల్లో చెల్లింపులు చేస్తే మన దగ్గరే అధికంగా పాడి రైతులు పాలు పోసే అవకాశం ఉంటుందని, దీనికి తగిన విధంగా పక్కా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి మండలంలో 5, 6గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు ఉండాలని, ప్రభుత్వ స్థలాల్లో వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఎటువంటి ఆటంకాలు రాకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. విజయ డైరీ గవర్నింగ్ బాడీ పనితీరును పరిశీలించి అదేవిధంగా ఇందిరా మహిళా డైరీ గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య,

లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.వేణుమనోహర్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ.మొహమ్మద్ నూరుద్దిన్, వివిధ శాఖల అధికారులు, తదితరులున్నారు.

## ఏపీలో ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు షెడ్యూల్ విడుదల

అమరావతి, అక్టోబర్ 18: ఏపీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు నకు ఉన్నత విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. మార్చి -2025లో పరీక్షలు రాయనున్న ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు ఈనెల 21 నుంచి నవంబర్ 11 వ తేదీ వరకు ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. వెయ్యి రూపాయల ఆలస్య రుసు ంతో నవంబర్ 20వ తేదీ వరకు అవకాశం కల్పిం చామని వెల్లడిం చారు. ఇకపై గడువు అవకాశం ఉండదని అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్ కు సూచిం చామని వివరించారు. ఇంటర్ పరీక్షలు ప్రైవేటుగా రాయదలిచిన విద్యార్థులకు అటెండెన్స్ మినహాయి స్తున్నట్లు తెలిపారు.

# పలు అభివృద్ధి పనులకోసం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

**- 51 కోట్ల రూపాయల ప్రతిపాదనలు అందజేత**

భద్రాద్రికొత్తగూడెం, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి) : అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు బీటి రోడ్లు అంతర్గత రోడ్లు ఇతర అభివృద్ధి పనుల గురించి రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని వారి ఛాంబర్ లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితిని నెలకొన్న సమస్యలను పూర్తిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి వివరించి అభివృద్ధికోసం నిధులు కేటాయించవలసిందిగా వినతి పత్రంతో పాటుగా 51కోట్ల రూపాయల ప్రతిపాదనలు అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా సమస్యల పరిష్కారానికి కృషిచేసి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వ సహకారంతో నిధులు కేటాయిస్తామని తెలిపారు.



# నేటి భారత్ వేగవంతమైన అభివృద్ధిని, సుసంపన్నమైన వారసత్వాన్ని ఏకకాలంలో నిర్వర్తించే పనిలో నిమగ్నమైంది : పీఎం

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: అంతర్జాతీయ అభిధమ్మ దివస్ వేడుకలు, ప్రాచీన భాషగా పాళీకి గుర్తింపు వచ్చిన సందర్భంగానూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు పాల్గొన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. అభిధమ్మను బోధించిన అనంతరం స్వర్గం నుంచి బుద్ధుడు తిరిగి వచ్చిన రోజును అభిధమ్మ దివస్‌గా పాటిస్తారు. బుద్ధుని అభిధమ్మ బోధనలు పాళీ భాషలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రాచీన భాషగా పాళీకి ఇటీవల దక్కిన గుర్తింపు... ఈ ఏడాది అభిధమ్మ దివస్ వేడుకల ప్రాధాన్యాన్ని పెంచింది.

ఈ సందర్భంగా అభిధమ్మ దివస్ వేడుకలకు హాజరయ్యే అవకాశం లభించినందుకు ప్రధానమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ప్రేమ, కరుణతో ప్రపంచాన్ని మెరుగైన ప్రదేశంగా మార్చవచ్చని అన్నారు. గతేడాది కుశీనగర్లో ఇదే తరహా కార్యక్రమంలో పాల్గొన్న విషయాన్ని శ్రీ మోదీ గుర్తు చేసుకున్నారు. జన్మించినప్పటి నుంచి మొదలై ఇప్పటి వరకు బుద్ధ భగవానునితో తన అనుబంధం కొనసాగుతోందని తెలిపారు. గుజరాత్‌లోని వాద్‌నగర్లో తాను జన్మించానని, ఒకప్పుడు అది ప్రముఖ బౌద్ధ క్షేత్రమని ప్రధానమంత్రి తెలిపారు. ఈ క్షేత్రం బుద్ధుని ధర్మం, బోధనలతో తన అనుభవాలకు ప్రేరణగా మారిందని వెల్లడించారు. గత పదేళ్లుగా దేశవిదేశాల్లో బుద్ధునికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తనకు వచ్చిన అవకాశాల గురించి ప్రధాని వివరించారు. నేపాల్‌లోని బుద్ధ జన్మక్షేత్ర సందర్శన, మంగోలియాలో బుద్ధ భగవానుని విగ్రహావిష్కరణ, శ్రీలంకలో వైశాఖి సమారోహ్‌లో పాల్గొన్న సందర్భాలను గుర్తు చేసుకున్నారు. సంఘాన్ని, సాధకుడిని కలిపింది బుద్ధుడి ఆశీర్వాద ఫలితమేనని ప్రధాని నమ్మకం వ్యక్తం చేశారు.

బుద్ధుడు తన ప్రవచనాలను చెప్పిన పాళీ భాషకు ఈ నెలలోనే భారత ప్రభుత్వం నుంచి ప్రాచీన భాషగా గుర్తింపు లభించడం ఈ ఏడాది అభిధమ్మ దివస్ ప్రత్యేకంగా మారిందని ప్రధాన మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు బుద్ధ భగవానుడు అందించిన గొప్ప సాంస్కృతిక వారసత్వానికి దక్కిన గౌరవంగా ప్రధాని అభివర్ణించారు. ధర్మంలో అభిధమ్మ ఉందని, దాని సారాన్ని అర్థం చేసుకోవడానికి పాళీ భాషలో ప్రావీణ్యం ఉండాలని శ్రీ మోదీ అన్నారు. ధర్మం అంటే బుద్ధుని సందేశమని, మానవ ఉనికికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానమని, మానవాళికి శాంతి మార్గమని, బుద్ధుని నిత్య బోధనలని, సమస్త మానవాళి సంక్షేమానికి ఇచ్చిన హామీ అని శ్రీ మోదీ వివరించారు. బుద్ధుని ధర్మం ద్వారా ఈ ప్రపంచం నిరంతరం జ్ఞానం పొందుతోందని అన్నారు.

బుద్ధుడు మాట్లాడిన పాళీ భాష దురదృష్టవశాత్తూ వాడుకలో లేదని ప్రధాని అన్నారు. భాష అనేది మాట్లాడుకోవడానికి మాత్రమే కాదని, అది సంస్కృతి, సంప్రదాయాలకు ఆత్మవంటిదని తెలిపారు. ఇది ప్రాథమిక వ్యక్తీకరణతో ముడిపడి ఉందని, ప్రస్తుత తరుణంలో పాళీని సజీవంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ బాధ్యతను వినమ్రంగా నిర్వర్తించిందని సంతృప్తి వ్యక్తం చేశారు. కోట్ల మంది బుద్ధ భగవానుని అనుచరులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

"భాష, సాహిత్యం, కళలు, ఆధ్యాత్మిక వారసత్వాలే ఒక సమాజ ఉనికిని తెలియజేస్తాయి'' అని ప్రధానమంత్రి అన్నారు. ఏ దేశమైనా తన భూభాగంలో చారిత్రక అవశేషం లేదా కళాకృతి బయటపడినప్పుడు దాన్ని ప్రపంచం ముందు సగర్వంగా ప్రదర్శిస్తాయని అన్నారు. ప్రతి దేశం తన ఉనికితో గత వారసత్వాన్ని అనుసంధానించుకుంటోందని, ఈ విషయంలో భారత్ వెనకబడి ఉందని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన దండయాత్రలు, స్వాతంత్ర్యం అనంతరం కొనసాగిన బానిస మనస్తత్వమే దీనికి కారణమన్నారు. ఇక్కడి వ్యవస్థలను భారతదేశంలోని తిరోగమన శక్తులు ఆక్రమించాయని అభిప్రాయపడ్డారు. భారత దేశ ఆత్మలో నిండి ఉన్న బుద్ధుడు, స్వాతంత్ర్య సమయంలో స్వీకరించిన అతని చిహ్నాలు తదనంతర దశాబ్దాల్లో మరుగున పడిపోయాయని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా పాళీకి సరైన గుర్తింపు దక్కలేదని విచారం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం దేశం ఆత్మన్యూనత భావన నుంచి బయటపడుతోందని, పెద్ద నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఓ వైపు పాళీ భాషకు ప్రాచీన భాష హోదాను కల్పిస్తూ, అదే గౌరవాన్ని మరాఠీకి కూడా ఇచ్చినట్లు తెలిపారు. మరాఠీ మాతృభాష అయిన బాబా సాహెబ్ అంబేద్కర్ సైతం బౌద్ధ ధర్మాన్ని పాటించేవారని, ధర్మ దీక్షను పాళీలోనే స్వీకరించారని తెలిపారు. బెంగాలీ, అస్సామీ, ప్రాకృత భాషలకు ప్రాచీన హోదాను కల్పించడంపై చర్చించారు.

"భారత్‌లోని వివిధ భాషలే దేశ వైవిధ్యాన్ని పోషిస్తున్నాయి'' అని ప్రధానమంత్రి అన్నారు. గతించిన కాలంలో భాషా ప్రాధాన్యం గురించి ప్రధానంగా ప్రస్తావిస్తూ జాతి నిర్మాణంలో ప్రతి భాషా కీలక పాత్ర పోషించిందని శ్రీ మోదీ అన్నారు. దేశంలో అమల్లోకి వచ్చిన నూతన విద్యావిధానం కూడా భాషలను పరిరక్షించుకునే మాధ్యమంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో మాతృభాషలో చదువుకునే అవకాశం ఉండటంతో ఇప్పుడు అవి మరింత బలోపేతం అవుతాయని శ్రీమోదీ తెలిపారు.

వాగ్దానాలను నెరవేర్చేందుకు ఎర్రకోట నుంచి 'పంచ ప్రాణ్' దృక్పథాన్ని ముందుకు తీసుకువచ్చినట్లు ప్రధాని తెలిపారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణం, బానిసత్వపు ఆలోచనల నుంచి విముక్తి, దేశ ఐక్యత, కర్తవ్య నిర్వహణ, వారసత్వం పట్ల గర్వపడటమే పంచ్ ప్రాణ్ ఉద్దేశమని శ్రీ మోదీ వివరించారు. ప్రస్తుతం భారత్ వేగవంతమైన అభివృద్ధి, ఘనమైన వారసత్వం అనే రెండు ఉద్దేశాలను ఏకకాలంలో నెరవేర్చడంలో నిమగ్నమై ఉందని ఆయన అన్నారు. భగవాన్ బుద్ధునికి సంబంధించిన వారసత్వ సంపద పరిరక్షణకు పంచ ప్రాణ్ కార్యక్రమం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు.

భారత్, నేపాల్ దేశాల్లో బుద్ధుడికి సంబంధించిన ప్రదేశాలను బుద్ధిస్ట్ సర్క్యూట్‌గా అనుసంధానిస్తూ చేస్తున్న అభివృద్ధి ప్రాజెక్టుల గురించి శ్రీ మోదీ వివరించారు. కుశీ నగర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, లుంబినీలో ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ బుద్ధిస్ట్ కల్చర్ అండ్ హెరిటేజ్, లుంబినీలోని బౌద్ధ విశ్వ విద్యాలయంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ బౌద్ధ అధ్యయన కేంద్రం ప్రారంభమయ్యాయని తెలిపారు. బుద్ధగయ, శ్రావస్తి, కపిలవస్తు, సాంచి, సాత్నా, రేవా తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ నెల 20న వారణాసి, సారనాథ్‌లో అనేక అభివృద్ధి పనులను ప్రారంభించ నున్నట్టు తెలిపారు. నూతన నిర్మాణా లతో పాటు భారతదేశ ఘనమైన వారసత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందని తెలిపారు. గత పదేళ్లలో 600 ప్రాచీన వారసత్వ కళాకృతులు, చిహ్నాలను ప్రభుత్వం దేశానికి తిరిగి తీసుకువచ్చిందని, వాటిలో ఎక్కువ భాగం బౌద్ధమతానికి సంబంధించినవని శ్రీ మోదీ తెలిపారు. బుద్ధుని వారసత్వ పునరుజ్జీవనంలో భాగంగా భారత్ తన సంస్కృతి, నాగరికతలను సరికొత్తగా ఆవిష్కరిస్తోందన్నారు.

బుద్ధ భగవానుని బోధనలను దేశ ప్రయోజనాలకే పరిమితం చేయకుండా సమస్త మానవాళి సంక్షేమార్థం ప్రచారం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. బుద్ధుని బోధనలు అనుసరించే దేశాలను ఏకం చేసే ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. శ్రీలంక, మయన్మార్ లాంటి దేశాలు పాళీ భాషలోని వ్యాఖ్యానాలను చురుకుగా సంకలనం చేస్తున్నాయన్నారు. ఇదే తరహా ప్రయత్నాలను భారత్‌లోనూ చేస్తున్నామని, దానికోసం సంప్రదాయ పద్ధతులతో పాటు, ఆధునిక విధానాలను అవలంబిస్తున్నట్లు తెలిపారు. పాళీ భాషను ప్రోత్సహించడానికి ఆన్‌లైన్ వేదికలు, డిజిటల్ ఆర్కైవ్స్, యాప్‌లు ఉపయోగిస్తున్నామని శ్రీ మోదీ వివరించారు. బుద్ధ భగవానుని బోధనలను ఆకళింపు చేసుకోవడంలో అంతర్గత అన్వేషణ, విద్యా పరిశోధన ప్రాధాన్యాన్ని వివరిస్తూ "జ్ఞానం, ప్రశ్నల కలయికే బుద్ధుడు" అని అన్నారు. యువతను ఈ కార్యక్రమం దిశగా నడిపించే విషయంలో బౌద్ధ విద్యాలయాలు, బిక్షువులు అందించిన తోడ్పాటు పట్ల గర్వం వ్యక్తం చేశారు. 21వ శతాబ్దంలో అంతర్జాతీయంగా పెరుగుతున్న అస్థిర పరిస్థితుల గురించి ప్రస్తావిస్తూ ప్రస్తుత తరుణంలో బుద్ధుని బోధనలు ప్రపంచానికి అవసరమని స్పష్టం చేశారు. "భారత దేశం ప్రపంచానికి బుద్ధుడిని అందించింది. యుద్ధాన్ని కాదు" అని ఐక్యరాజ్యసమితిలో తాను ఇచ్చిన సందేశాన్ని మరోసారి గుర్తుచేశారు. యుద్ధంలో కాకుండా బుద్ధుని బోధనల్లోనే ప్రపంచానికి సమాధానం దొరుకుతుందన్నారు. తథాగతుడి నుంచి నేర్చుకోవాలని, యుద్ధాన్ని తిరస్కరించి శాంతికి మార్గం సుగమం చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. శాంతి కంటే గొప్ప ఆనందం మరొకటి లేదన్న బుద్ధ భగవానుడి మాటలను ఉటంకిస్తూ ప్రతీకారాన్ని కక్షతో అణచలేమని, కరుణ మానవత్వంతో మాత్రమే ద్వేషాన్ని అధిగమించగలమని అన్నారు. అందరి ఆనందం, క్షేమం కోరిన బుద్ధుని సందేశాన్ని వివరించారు. 2047 వరకు ఉన్న 25 ఏళ్ల కాలాన్ని భారత్ 'అమృతకాలం'గా గుర్తించిందని శ్రీ మోదీ తెలిపారు. ఈ అమృతకాలం దేశ పురోభివృద్ధి సమయమని, భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిర్మించే కాలమని అన్నారు. ఈ ప్రయాణంలో బుద్ధ భగవానుని బోధనలు మార్గనిర్దేశం చేస్తాయని తెలిపారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ఈ దేశం వనరులను సద్వినియోగం చేసుకునే విషయంలో జాగ్రత్తగా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందని అన్నారు. యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ మార్పుల సంక్షోభం గురించి మాట్లాడుతూ ఈ సమస్యకు భారత్ స్వయంగా పరిష్కారం కనుక్కోవడంతో పాటు ప్రపంచంతోనూ దాన్ని పంచుకుంటుందని తెలిపారు. ఇతర దేశాలను కలుపుకొని మిషన్ లైఫ్‌ను ప్రారంభించామన్నారు. బుద్ధ భగవానుడి బోధనను శ్రీ మోదీ పఠిస్తూ మనం చేసే ఏ మంచి కార్యక్రమమైనా అది మనతోనే మొదలవ్వాలనే ఆలోచనే మిషన్ లైఫ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వ్యక్తి సరైన జీవన విధానం అవలంభించడం ద్వారానే అతని భవిష్యత్తుకు మంచి మార్గం ఏర్పడుతుందని ఆయన అన్నారు.

జీ -20 దేశాలకు భారత్ అధ్యక్షత వహించిన సమయంలో అంతర్జాతీయ సౌర విద్యుత్ కూటమి, బయో ఫ్యూయల్ కూటమి, ఒకే సూర్యుడు, ఒకే ప్రపంచం, ఒకే గ్రిడ్ విధానం మొదలైన వాటిని ప్రపంచానికి అందించిందని శ్రీ మోదీ తెలిపారు. వాటిన్నింటిలోనూ బుద్ధుని ఆలోచనలు ప్రతిబింబిస్తున్నాయని వివరించారు. భారత్ చేసే ప్రతి ప్రయత్నం ప్రపంచానికి భద్రమైన భవిష్యత్తును అందిస్తుందని తెలిపారు. భారత్?మధ్య ప్రాచ్యం?ఐరోపా ఆర్థిక కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ కార్యక్రమం, 2030 నాటికి భారతీయ రైల్వేల్లో సున్నా కర్బన ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకోవడం, పెట్రోల్‌లో కలిపే ఇథనాల్‌ను 20 శాతానికి పెంచడం తదితర కార్యక్రమాల గురించి ప్రధాని ప్రస్తావించారు. భూమిని సంరక్షించే విషయంలో భారత్ దృఢ సంకల్పాన్ని ఇవి తెలియజేస్తాయి. ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలు బుద్ధుడు, ధర్మం, సంఘం నుంచే ప్రేరణ పొందాయని ప్రధానమంత్రి తెలిపారు. ప్రపంచ సంక్షోభ సమయాల్లో మొదటగా భారత్ స్పందించడమే దీనికి ఉదాహరణ అని అన్నారు.

# న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటాం..

అమరావతి, అక్టోబర్ 18:ఎన్నికల ముందు న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటామని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో నిర్వహించిన విశాఖపట్నం బార్ అసోసియేషన్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీలోని నాయకులందరూ చట్టాన్ని గౌరవిస్తారు.. ఇక్కడ రాజకీయాలు మాట్లాడటం లేదు. యువగళం పేరుతో 222 రోజుల పాటు 3,132 కి.మీల పాదయాత్ర చేశా. ప్రతిరోజూ ఎంతో మందిని కలిసి వారి సమస్యలు తెలుసుకున్నా. అందులో భాగంగానే న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులు, కష్టాల గురించి తెలుసుకున్నా. నాపైన కూడా బాధ్యత పెరిగింది. న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటాం.

న్యాయవాదులకు హెల్త్ కార్డులు మంజూరు విషయంలో.. ఆరోగ్యశ్రీయే కాకుండా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకంతో అనుసంధానం చేసి మెరుగైన స్కీమ్ తీసుకురావాలనేది మా లక్ష్యం. కొంచెం సమయం ఇవ్వండి. సంక్షేమ పథకాలకు సంబంధించి వయస్సు పరిమితిని సడలించాలని కోరారు. దీనిపై కూడా చర్యలు తీసుకుంటాం. పెండింగ్ లో ఉన్న కోర్టు భవనాల పనులు పూర్తిచేస్తాం.

ఇళ్ల నిర్మాణం, ఇంటి పట్టాలు అందిస్తాం. న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ రోజు నా ప్రత్యర్థి లాయర్ నన్ను ఏమైనా ప్రశ్నించే స్వేచ్ఛ ఉంది. కానీ గతంలో అలాంటి స్వేచ్ఛ ఉండేది కాదు. కోర్టులో వాదించి బయటకు వస్తే లాయర్లపై దాడిచేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మీరందరూ మర్చిపోయారు. కార్యకర్తలను కాపాడేందుకు మాచర్లకు వెళ్లిన మా లాయర్ పారా కిషోర్ పై తీవ్రంగా దాడికి తెగబడ్డారు. వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రొఫెషనల్ ట్యాక్స్ రద్దుపై పరిశీలన చేస్తాం." అని తెలిపారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై సీఎంతో చర్చించి నిర్ణయం

"విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై అందరూ అడిగారు. ముఖ్యమంత్రి గారితో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటాం. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పై న్యాయవాదులు పెద్దఎత్తున పోరాడారు. ఆ చట్టం అమలై ఉంటే మన భూములు మన చేతుల్లో ఉండేవి కావు. గత పాలకులు ఎప్పుడూ ఈ విధంగా కూర్చొని మాట్లాడలేదు. పరదాలు కట్టుకుని తిరిగే ప్రభుత్వం కాదు మాది. చేయగలిగినది తప్పకుండా చేస్తాం." అని బరోసా ఇచ్చారు.

విశాఖలో టీసీఎస్ రాక ప్రారంభం మాత్రమే..

"విశాఖలో ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. రాజకీయంగా, కొన్ని కారణాల వల్ల నేను మంగళగిరిని ఎంచుకున్నా. విశాఖను అభివృద్ధి చేసేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. మొదటి వంద రోజుల్లో ఒక్క ఐటీ కంపెనీ అయినా ఇక్కడకు తీసుకువస్తానని హామీ ఇచ్చా. 120 రోజులు పట్టింది. టీసీఎస్ ను గర్వంగా తీసుకువచ్చాం. ఇది ప్రారంభం మాత్రమే? సీఎం చంద్రబాబుకి విశాఖపై ఎనలేని ప్రేమ ఉంది. ఇక్కడ అనేక పరిశ్రమలు తీసుకువస్తాం. ఐటీ కంపెనీలు, డేటా సెంటర్ వస్తాయి. సెజ్ ను కూడా తీసుకువస్తాం. 2019లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన పట్టణాల్లో విశాఖ 9వ స్థానంలో ఉంటే గత పాలనలో 10వ స్థానానికి పడిపోయింది. ఎకనామిక్ యాక్టివిటీ ఆగిపోయింది. దీనిని పునరుద్ధరిస్తాం. పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకువస్తాం. ఎయిర్ పోర్ట్, మెట్రో ప్రాజెక్టు, స్పెషల్ ఎకనమిక్ జోన్లు తీసుకువస్తాం. గతంలోనే విశాఖలో మాకు 4 స్థానాలు కట్టబెట్టారు. అలాంటి విశాఖను మేం మర్చిపోం." అతి అన్నారు.

విశాఖ ప్రజలు ఆశీర్వదించారు, దీవించారు

కుప్పం కంటే మంగళగిరిలో నాకు ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని నేను బాబుగారితో ఛాలెంజ్ చేశా. ఫలితాల రోజు మంచి మెజార్టీ ఇచ్చారని ఆనందపడ్డా. కానీ విశాఖ ప్రజల వల్ల ఆ ఆనందం ఎక్కువ సేపు లేదు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించిన నియోజకవర్గాలు గాజువాక, భీమిలి తర్వాత మూడో స్థానంలో మంగళగిరి నిలిచింది. విశాఖ ప్రజలు ఆశీర్వదించారు, దీవించారు. విశాఖను అభివృద్ధి చేస్తాం. అందులో భాగంగానే తొలి అడుగు టీసీఎస్. కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై వివరాలు తీసుకుని ముందుకువెళ్తాం.

రాష్ట్రం మైనస్ నుంచి మొదలైంది..

ఈ రోజు రాష్ట్రం మైనస్ నుంచి మొదలైంది. 2014లో జీరోలో ఉంటే 2024లో మైనస్ లో ఉన్నాం. కేంద్రం సహకారం వల్లే ప్రభుత్వం నడిపించుకోగలుగుతున్నాం. లేకపోతే పరిస్థితి దారుణంగా ఉండేది. ఫీజు రీయింబర్స్ మెంట్ కు 2,500 కోట్లు బకాయిలు పెట్టారు. చిక్కీ, గుడ్లకు రూ.250 కోట్లు బకాయిలు పెట్టారు. ఆరోగ్యశ్రీకి రూ.2వేల కోట్లు బకాయిలు పెట్టారు. వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.


వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు..

ఎంపి ముతుకుమిల్లి శ్రీ భరత్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం. జిల్లా కోర్టులో అటెండర్లకు జీతాలు సక్రమంగా అందడం లేదని చెబుతున్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామనే హామీకి కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే టీసీఎస్ ద్వారా 10వేల ఉద్యోగాలు రాబోతున్నాయి. లాయర్లకు నిరుద్యోగ భృతి కింద ఇచ్చే రూ.3వేలు లాయర్లకు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం.

విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సత్యనారాయణ మాట్లాడుతూ.. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతోపాటు లాయర్లకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. విశాఖ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారన్నారు. అనంతరం మంత్రి నారా లోకేష్ ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.

# ప్రధానమంత్రి అధ్యక్షతన 'ఎన్‌డిఏ' ముఖ్యమంత్రులు.. ఉప ముఖ్యమంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ తన అధ్యక్షతన 'ఎన్‌డిఏ' ముఖ్యమ ంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించారు. దేశ ప్రగతితోపాటు నిరుపేదలు, అణగారిన వర్గాల సాధికారతపై తమ నిబద్ధతను ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు."ఎన్‌డిఏ' పాలనలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్య మంత్రులతో సమావేశానికి నేనివాళ అధ్యక్షత వహించాను. ఈ సందర్భంగా సుపరిపాలన, ప్రజా జీవనం మెరుగుదలపై మేము విస్తృతంగా చర్చించాం. దేశ పురోగమన ంతోపాటు నిరుపేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి దిశగా కృషిని మా కూటమి సదా కొనసాగిస్తుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.




# నెక్సస్ హైదరాబాద్ మాల్లో 'కాంటినెంటల్ కాఫీ'- వంద కిలోల కాఫీ గింజలతో ప్రవేశ ద్వారం- కాఫీ ప్రియులకు సాదర స్వాగతం

హైదరాబాద్, అక్టోబర్ 18: నెక్సస్ సెలెక్ట్ ట్రస్టులో భాగమైన నెక్సస్ హైదరాబాద్, ప్లాటినమ్ అవుట్‌డోర్‌తో కలిసి కాంటినెంటల్ కాఫీ కోసం భాగస్వామ్యం అయ్యాయి. ఈ భాగస్వామ్యంతో కాంటినెంటల్ కాఫీకి ఫుడ్ కోర్టుపైన ప్రత్యేకంగా పేరు పెట్టుకునే హక్కును కల్పిస్తుంది. ఇది తొలిసారి చేపట్టిన వినూత్న ప్రయత్నం. ఈ భాగస్వామ్యంతో కాంటినెంటల్ కాఫీ మాల్ ను సందర్శించే సందర్శకుల రద్దీని సద్వినియోగం చేసుకొని కస్టమర్ బేస్‌ను పెంచుకోనుంది. తద్వారా ఈ బ్రాండ్ గుర్తింపును పెంచుకుంటుంది. దీనిని మాడిసన్ వరల్డ్ కు చెందిన ప్లాటినమ్ అవుట్‌డోర్ నిర్వహించింది. నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిశాంక్ జోషి మాట్లాడుతూ ఇది వినూత్న క్రాస్ ఫంక్షనల్ మార్కెటింగ్‌కు ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఇది నెక్సస్ బ్రాండ్స్‌కు విజయాన్ని అందించనుందన్నారు. సందర్శకులకు ఆకర్షణీయమైన, చిరస్మరణీయమైన అనుభవానికి సహాయపడుతుందని తెలిపారు. కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్‌తో ఈ భాగస్వామ్యం, అందరికీ ప్రీమియం షాపింగ్ అనుభవాన్ని అందించాలనే మా లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. కాఫీ ప్రియుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కాఫీ థీమ్ అనుభవ కేంద్రాన్ని ప్రారంభించే అవకాశాన్ని ఇస్తుందన్నారు.




ఈ మాల్ సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు 100 కిలోల కాఫీ గింజలతో రూపొందించిన ప్రవేశ ద్వారం, కాఫీ సుగంధాన్ని విడుదల చేసే డిస్పెన్సర్లు సందర్శకులను కట్టిపడేయనున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా కాంటినెంటల్ కాఫీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాజా చక్రవర్తి మాట్లాడుతూ కాంటినెంటల్ కాఫీ.. కాఫీ ప్రియుల మనస్సు దోచేందుకు సిద్ధంగా ఉందన్నారు. వినూత్న అవకాశాల కోసం మాడిసన్ బృందంతో భాగస్వామ్యం అయ్యామన్నారు. నెక్సస్ హైదరాబాద్ మాల్లో ఫుడ్ కోర్ట్‌కు పేరు పెట్టే హక్కులను పొందడం గర్వంగా ఉందని తెలిపారు. దీంతో నగరంలోని అత్యంత ప్రజాదరణ పొందిన మాల్‌లో ఉనికిని చాటుకునేందుకు అవకాశం వచ్చిందన్నారు. ఈ మాల్ ఫుడ్ కోర్ట్ ప్రవేశద్వారం వద్ద వ్యూహాత్మకంగా ఉన్న ఈ స్టోర్ కస్టమర్లు కాఫీ ప్రపంచంలోకి వెళ్లేందుకు అవకాశం ఇస్తుందన్నారు. ఈ కాఫీ షాప్లో ఉన్న క్షణాలను సోషల్ మీడియాలో షేర్ చేయడానికి కాఫీ కప్పు ఆకారంలో ఉన్న ఒక ప్రత్యేకమైన ఫొటో బూత్ కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్లాటినమ్ అవుట్‌డోర్, ఎంఆర్పీ సీఈవో దీపాంకర్ సన్యాల్ మాట్లాడుతూ ఈ వినూత్న ప్రచారంలో భాగమైనందుకు సంతోషిస్తున్నామన్నారు. షాపింగ్ లాండ్‌మార్క్‌గా నెక్సస్ హైదరాబాద్ ఉందన్నారు. కాఫీ అభిమానులను సాదరంగా ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

# ప్రపంచ తెలుగు రచయితల సంఘం

కార్యాలయం చిరునామా: ప్రపంచ తెలుగు రచయితల సంఘం, సత్నాం టవర్స్, బకింగ్ హామ్‌పేట పోస్టాఫీస్ ఎదురు, గవర్నర్‌పేటవిజయవాడ-520 002.

## "ఆలపిస్తాం తీయగా" యువగళ సమ్మేళనం ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ప్రత్యేక ఆకర్షణ

2024 డిసెంబరు 28,29 తేదీలలో విజయవాడ కె.బి.యన్. కళాశాల ఆవరణలో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో "పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే అంశంపై "ఆలపిస్తాం తీయగా" ప్రత్యేక యువగళ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నాం. ప్రముఖ రచయితలు వేదికపైన అశీనులై ఈ యువగళ సమ్మేళనాన్ని నడిపిస్తారు. రోజుకు 50 మంది చొప్పున రెండు రోజుల్లో 100 మంది కవులకు మాత్రమే ఈ యువగళ సమ్మేళనంలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

ప్రతిభావంతమైన ప్రదర్శనకు ఈ మహాసభలలో ప్రత్యేక సత్కారం, "పర్యావరణకవి" పురస్కారం అందించి గౌరవిస్తాము.

ప్రతినిధులుగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఈ యువగళ సమ్మేళనంలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

40 యేళ్లలోపు వారంతా ఈ యువగళ సమ్మేళనంలో పాల్గొనవచ్చు.

కవిత, గేయం,లలిత గీతం, గజల్, పద్యం ఏ ప్రక్రియలోనైనా తెలుగు భాషలో కవులు తమ గళాన్ని వినిపించవచ్చు.

2 నిమిషాల కాలవ్యవధి మించకుండా రచన ఉండాలి.

స్వీయ రచనలే అయి ఉండాలి. వ్రాతప్రతిని ముందుగా 9440 167697 నంబరుకు వాట్సాప్ ద్వారా గాని క్రింద ఇచ్చిన కార్యాలయం చిరునామాకు గాని అక్టోబరు 31లోగా పంపవలసి ఉంటుంది.

ఎంపికైన రచనలకు మాత్రమే యువగళంలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

మహాసభల ఆహ్వానపత్రంలో యువగళ కవుల పేర్లు ప్రకటిస్తాము.

పర్యావరణాన్ని కాపాడుకునే విషయంలో నేటి తరం యువతీ యువకుల మనో భావాలను ఈ యువగళ సమ్మేళనం ప్రతిబింబిస్తుందని ఆశిస్తున్నాం. పర్యావరణ కవుల ఈ గళాలను పుస్తక రూపంలో తెచ్చే ప్రయత్నంలో ఉన్నాం.

ఈ మహాసభలలో విద్యార్థులకోసం కథ, కవిత పద్యం వగైరా 10 అంశాలపై శిక్షణా తరగతులు కూడా ఏర్పాటు చేస్తున్నాము. దేశం నలుమూలల నుండి తెలుగు విద్యార్థులు ఈ తరగతులలో పాల్గొంటున్నారు. విద్యాసంస్థ ధృవీకరణ పత్రంతో వస్తే, వారికి భోజన వసతి (డార్మెటరీ) సౌకర్యాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాము. అక్టోబరు 31లోగా వారు తమపేర్లను నమోదు చేసుకోవలసి ఉంటుంది.

పై రెండు కార్యక్రమాలే కాకుండా ప్రతినిధులకు కవిసమ్మేళనాలు, ప్రసంగ సదస్సులు, ఇంకా ఇతర సాహితీ కార్యక్రమాలు ఉంటాయి. ప్రతినిధులుగా నమోదయినవారు ఈ మహాసభలలో పైన పేర్కొన్న అంశాలలో తాము ఎందులో పాల్గొన దలచారో మాకు తెలియజేస్తే సాధ్యమైనంత ఎక్కువ మందికి అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తాము.

**మరిన్ని వివరాలకు సంప్రదించండి:**

**గుత్తికొండ సుబ్బారావు- 9440167697,**
**డా॥ జి.వి.పూర్ణచందు-9440172642.**

కార్యాలయం చిరునామా: ప్రపంచ తెలుగు రచయితల సంఘం, సత్నాం టవర్స్, బకింగ్ హామ్‌పేట పోస్టాఫీస్ ఎదురు, గవర్నర్‌పేట విజయవాడ-520 002.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.